క్లుప్తంగా

డ్రాయింగ్ పోటీలకు విశేష స్పందన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరురోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు విశేష స్పందన లభించింది. 50 మంది పైగా విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను పరీక్షించుకున్నారు. పోటీలను డ్రాయింగ్ టీచర్ స్వాతి పూర్ణిమ పర్యవేక్షించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు జూన్ 6న వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథాలయాధికారి కె.నాగరాజు తెలిపారు.

పొగాకుకు దూరంగా ఉందాం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): పొగాకును ఉపయోగించడం వల్ల ఆరోగ్యపరంగా శరీరంపై అనేక చెడు ప్రభావాలు కలుగుతాయని అందువల్ల పొగాకుకు దూరంగా ఉండాలని ప్రభుత్వ దంత వైద్యశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని శ్రీనివాస్ చెప్పారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ దంత వైద్య కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి, హెచ్‌సీజీ క్యాన్సర్ ఆసుపత్రి సంయుక్తంగా శనివారం గుణదలలోని ప్రభుత్వ దంత వైద్యకళాశాల దగ్గర అవగాహన ర్యాలీ జరిగింది. నేషనల్ ఓరల్ హెల్త్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంత్, ఓరల్ మెడిసిన్ అండ్ రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.రమేష్‌తో పాటుగా బోధన, బోధనేతర సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల అందజేత



మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ నిరుపేదలు బాధపడకూడదనే సదుద్దేశంతో తాము ఒక్క రోజు ముందుగానే పింఛన్లు అందజేస్తున్నామని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక 27వ డివిజన్ గులాబీతోట, 28వ డివిజన్ భానునగర్‌లో శనివారం కార్పొరేటర్ వీరమాచనేని లలితతో కలిసి పింఛన్ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాము ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఇచ్చిన ప్రతీ హామీను అమలు చేస్తామన్నారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాయకులు నవనీతం సాంబశివరావు, కొండ పాల్గొన్నారు.

చదరంగం క్రీడా సంబరాలకు సన్నద్ధం



విజయవాడస్పోర్ట్స్: చెస్ క్రీడా సంబరాలను విజయవాడ శివారు కానూరులోని స్కాట్స్‌పైన్ స్కూల్‌లో వారం రోజుల పాటు నిర్విరామంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ చలసాని ప్రతిమ తెలిపారు. ఆంధ్రా చెస్ అసోసియేషన్, ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్, స్కాట్స్‌పైన్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో చెస్ పోటీలు, కోచింగ్ క్యాంప్‌లు, చెస్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను స్కూల్‌లోని తన చాంబర్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కూల్ నిర్వహించిన కోచింగ్ క్యాంప్ శనివారం ముగిసిందని, జూన్ ఒకటో తేదీ ఆదివారం నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. జూన్ 2 నుంచి 6వ తేదీ వరకు గ్రాండ్ మాస్టర్ ఉచిత కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. మూడు, నాలుగు తేదీల్లో చెస్ స్కూల్ ట్రైనింగ్ ప్రోగ్రాంను నిర్వహిస్తున్నామన్నారు. ఆంధ్రా చెస్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎన్.ఎం.ఫణికుమార్, స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఎస్.శివ, ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ పి.రేణుక, కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ మేనేజర్లు మణిరత్నం, పి.రవీంద్ర పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మధురానగర్(విజయవాడసెంట్రల్): 26వ డివిజన్‌లో రూ.కోటి 90 లక్షలతో అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో ధ్వంసమైన రహదారులను నిర్మించడంతో పాటు యూజీడీ పైపులైన్ పనులు, శిథిలావస్థకు చేరిన మలేరియా కార్యాలయానికి మరమ్మతులు చేపడుతున్నామన్నారు. డివిజన్‌లోని ప్రతీ సమస్యను గుర్తించి ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లి సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నానన్నారు. నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశించిన సమయంలో పనులు పూర్తిచేయాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో నగరపాలకసంస్థ ఏఈ భవాని, నాయకులు తోట పాండు, వల్లభనేని సతీష్, కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

చినుకుపడితే చిత్తడే !

- కొద్దిపాటి వర్షాలకే రోడ్లపై నిలుస్తున్న వర్షపునీరు
- వాహన చోదకులకు తప్పని తిప్పలు
- గుంతలు పూడ్చాలని వినతి



డీ మార్ట్ వద్ద నిలిచిన వర్షపునీరు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని బావాజీపేట, డీ మార్ట్ సమీపంలోను, దేవీనగర్ రైల్వే అండర్ పాస్, దావు బుచ్చయ్యకాలనీ గుణదల రోడ్డు, మధురాన గర్ ఆర్‌యూబీ సర్వీసు రోడ్డు చినుకుపడితే చిత్తడిగా మారుతోంది. కొద్దిపాటి వర్షానికే ఇక్కడ రహదారులపై వర్షపునీరు నిలిచిపోవటంతో పాటు రోడ్డు బురదగా మారి వాహన చోదకుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. దేవీనగర్ రైల్వే అండర్ పాస్ వంతెన వద్ద, దావు బుచ్చయ్యకాలనీ గుణదల రోడ్డు వర్షపునీరు నిలిచిపోవటం వల్ల రోడ్డు గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. దీంతో తరచూ వాహన చోదకులు పాదచారులు జారి గాయాలబారిన పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో వర్షపునీరు ఎండకు ఎండాల్సిందే తప్ప బయటకు పోయే మార్గం లేదు. దీంతో కొద్దిపాటి వర్షానికే ఇక్కడ వర్షపునీరు రోడ్డుపై నిలిచి పోవటంతో రోడ్లు గుంతలు పడుతున్నాయి.

గుంతల్లోనే రాకపోకలు..

నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో రోడ్లు గుంతలు పడినా కనీస మరమ్మతులు చేయటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డును సరిచేయాలని, రోడ్డుపై వర్షపునీరు నిలిచిపోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పన్నులు వసూలు చేసే అధికారులు కనీసం రోడ్లకు అవసరమైన మరమ్మతులు చేయకపోవటం పట్ల వాహన చోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి రహదారులకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



బావాజీ పేటలో రోడ్డుపై నిలిచిన నీరు



దేవీనగర్ రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి వద్ద గుంతలు పడిన రోడ్డు

4న వ్యాసరచన, చిత్రకళ పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పోటీల నిర్వాహకులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మన ప్రకృతిని మనమే కాపాడుకుందాం అనే అంశంపై జూన్ 4వ తేదీన పాఠశాల, కళాశాల స్థాయి విద్యార్థులకు వ్యాసరచన, చిత్రకళా పోటీలను నిర్వహిస్తున్నామని డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీ ఫౌండర్ ప్రెసిడెంట్ పి.రమేష్ చెప్పారు. పోటీలకు సంబంధించిన వివరాలతో కూడిన పోస్టర్‌ను సిద్ధార్థ ఫార్మా కళాశాల ఆవరణలోని ఆడిటోరియంలో శనివారం ఆవిష్కరించారు. జూన్ 4వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సిద్ధార్థ ఫార్మా కళాశాల ఆవరణలో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. పోటీల విజేతలకు మరుసటి రోజు జూన్ 5వ తేదీ ఉదయం 10 గంటలకు పోటీలు జరిగిన ఆడిటోరియంలోనే బహుమతులు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనడానికి ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని, ఒకే పాఠశాల నుంచి ఎంతమంది విద్యార్థులు అయినా పాల్గొనవచ్చునని అన్నారు. పోటీల్లో పాల్గొనే ప్రతి విద్యార్థికి డ్రాయింగ్ షీట్ ఇస్తామని, కలర్స్ వారే తెచ్చుకోవాలని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఇస్తామన్నారు. పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నవారు జూన్ 4వ తేదీన నేరుగా మొగల్రాజపురం పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులో ఫార్మా కళాశాల ఆవరణలోని ఆడిటోరియం దగ్గరకు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు 95029 44913 నంబరులో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సునీత, గుడ్‌విన్ ఇండస్ట్రీస్ సీఈవో కిరణ్, మా జ్యూవెలరీ అధినేత కె.సుధాకర్, చిత్రకారులు కె.వెంకటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, డాక్టర్ రామ్‌చంద్, కౌషిక్, శరవణం, సుబ్బారావు, వెంకట్రావు పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్నారు.

నగదు రహిత సేవలపై సమీక్ష



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నగదు రహిత సేవలు అందించే దిశగా చర్యలు తీసుకోనున్నామని ఈవో శీనానాయక్ అన్నారు. ఈవో చాంబర్‌లో శనివారం దేవదాయ శాఖ ఐటీ మేనేజర్ ప్రసాద్, బ్యాంక్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులు ఆలయ ప్రాంగణంలో టికెట్లు తీసుకునేందుకు వీలుగా ఆధునిక కంప్యూటర్లు ఏర్పాటుకు బ్యాంక్ అధికారులతో చర్చించారు. తిరుమలలో ఇటీవల బ్యాంక్ ఏర్పాటు చేసిన మోడల్స్‌ను ఈవో శీనానాయక్ పరిశీలించారు. దేవస్థానానికి విరాళాలు, దర్శన టికెట్లు, ఆర్జిత సేవా టికెట్లు కొనుగోలుతో పాటు ప్రసాదాల కొనుగోలుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అమ్మవారికి నిర్వహించే అన్ని సేవలను ఆన్‌లైన్ ద్వారా భక్తులకు చేరవేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ కోటేశ్వరరావు, దేవస్థాన ఏఈవో జంగం శ్రీనివాసరావు, ఐటీ విభాగం పర్యవేక్షకులు హరీష్, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సు



కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులతో నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని.. మారుతున్న కాలానుగుణంగా ఉపాధి ఆధారిత కోర్సులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన 4 నెలల ఉచిత జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సు ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది.

4 నెలల ఉచిత శిక్షణ

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు నూతన సాంకేతికతను ఉపయోగించి ఇండస్ట్రీ నిపుణుల ద్వారా 4 నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ కాలంలో విద్యార్థులకు నూతన సాంకేతిక పరిశ్రమల పరిజ్ఞానం ఉపాధి అవకాశాలను కల్పించామని చెప్పారు. కోర్సు ముగింపు సందర్భంగా నిర్వహించిన పరీక్షలో పాల్గొన్న 20 మంది నూరు శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇంటర్, డిగ్రీ ఆపైన చదివిన నిరుద్యోగ యువతీ యువకులకు నిరంతరం తమ కళాశాల ఆవరణలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సు కొనసాగిస్తామని తెలిపారు. నూతన సాంకేతికత, పరిశ్రమల పరిజ్ఞానం ఉపయోగించి ఇండస్ట్రీ నిపుణుల ద్వారా శిక్షణ ఇవ్వటంతో పాటు కోర్సు పూర్తి చేసినయువతకు ఉపాధి అవకాశం కల్పిస్తున్నామన్నారు. ప్రస్తుతం శిక్షణ పూర్తి చేసుకున్న 20 మందికి విజయవాడ పరిధిలోని పలు ఇండస్ట్రీల్లో ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్ హబ్ స్పోక్ జి.విజయ దీప్, హబ్ ఇన్‌చార్జి తారక రవితేజ, ట్రైనర్ శారదా లక్ష్మి, కళాశాల సిబ్బంది, అభ్యర్థులు పాల్గొన్నారు.

మహిళా వికాసంతోనే దేశాభ్యున్నతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహిళా వికాసంతోనే దేశాభ్యున్నతి సాధ్యమవుతుందని కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.ఉష అన్నారు. కేబీఎన్ కళాశాల యూజీసీ ఉమెన్ స్టడీస్ సెంటర్ ఆధ్వర్యంలో 45 రోజులపాటు నిర్వహించిన వేసవి ఉచిత శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ముగింపు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య ఉష మాట్లాడుతూ మహిళ విజ్ఞానవంతురాలు అయితే ఆ కుటుంబం అంతా అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళా శక్తి ప్రగతికి దిక్సూచి అన్నారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ టి.శ్రీనివాసు మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల కోసం 45కి పైగా కోర్సులను ఉచితంగా అందించామని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి హిందూ హైస్కూల్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా తమ కళాశాలలో ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది రెండు వేల మంది శిక్షణ పొందారని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్ అందుకున్న కళాశాల అధ్యాపకుడు డాక్టర్ వీటీ రాంపవన్‌ను అతిథులు ఘనంగా సత్కరించారు.

కర్మల భవనాలను అందుబాటులోకి తేవాలి

మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర



జీఎస్ రాజు రోడ్డులో కూల్చేసిన కర్మల భవనం స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలోని కర్మల భవనాలన్నింటినీ పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ఆయన తన పర్యటనలో భాగంగా శనివారం అయోధ్యనగర్, సత్యనారాయణపురం, జీఎస్ రాజు రోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీఎస్ రాజు రోడ్డులో కూల్చేసిన పాత కర్మల భవనం స్థలంలో నూతన కర్మల భవనాన్ని నిర్మించేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ పరిధిలోగల కర్మల భవనాలకు మరమ్మతులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఎస్టేట్ విభాగం ఇంజినీరింగ్ విభాగం అధికారులు సమన్వయంతో నగరపాలక సంస్థకు చెందిన ఆస్తులను పరిశీలించి వాటిని కాపాడాలని సూచించారు. అనంతరం అయోధ్యనగర్‌లోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించి ఆహార పదార్థాల నాణ్యత, తాగునీరు, వాడకం నీరు సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. అన్న క్యాంటీన్లలో మరమ్మతులు ఉంటే ఎప్పటికప్పుడు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఆయనతోపాటు 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణి మూర్తి ఉన్నారు.

వృద్ధురాలి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వృద్ధురాలు అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్‌లోని వేణుగోపాల స్వామి వారి ప్రాంతంలో పిల్లా సాయిలక్ష్మి, వెంకటేష్ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరితో పాటు సాయిలక్ష్మి తల్లి బంకా పోలమ్మ(65) ఉంటోంది. ఆమె కొంత కాలంగా గొంతు క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఆమె మానసిక స్థితి కూడా సరిగా లేదు. మే 29వ తేదీ ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన పోలమ్మ సాయంత్రం అయినా తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుమార్తె సాయిలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వీఎంసీ రిటైర్డ్ ఉద్యోగులకు సత్కారం



సత్కారం అందుకున్న మేరీ ప్రశాంతితో అధికారులు, యూనియన్ నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగర పాలక సంస్థలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులను మున్సిపల్ కార్పొరేషన్ మినిస్టీరియల్ ఆల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ మేరీ ప్రశాంతి, అటెండర్ ధనలక్ష్మి, టైంస్కేల్ ఎస్ఎంఆర్ శ్రీనివాస్‌లను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న అడిషనల్ కమిషనర్ జనరల్ చంద్రశేఖర్, అకౌంటెంట్ బీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ ఇప్పటివరకు ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొంటూ ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించిన వారు ఇకపై తమ శేష జీవితాన్ని సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. యూనియన్ అధ్యక్షుడు దారా రాంబాబు, ప్రధాన కార్యదర్శి ఎస్వీఎస్ చలం, చీఫ్ అడ్వైజర్ వీఎంవీ రమణారెడ్డి, సహాయ కార్యదర్శి తుపాకుల ప్రతాప్, బుద్దె రాజా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన పోలీసులకు ఆత్మీయ వీడ్కోలు



విజయవాడస్పోర్ట్స్: సుదీర్ఘ కాలం క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన పోలీసు అధికారులు, సిబ్బందికి అడ్మిన్ డీసీపీ కె.జి.వి.సరిత ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. నగరంలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో రిటైర్డ్ పోలీసులను శనివారం దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. సీఎస్‌బీ ఎస్ఐ సి.హెచ్.శ్రీనివాసరావు, జగ్గయ్యపేట ఎస్ఐ బి.ఈ.వెంకటేశ్వరరావు, రిజర్వ్ ఎస్ఐ ఎస్.సత్యనారాయణ, పటమట ఏఎస్ఐ కె.వి.ఎల్.నారాయణ, ట్రాఫిక్ ఏఎస్ఐ సయ్యద్ రియాజుద్దీన్, తిరువూరు ఏఎస్ఐ సి.హెచ్.వెంకటేశ్వరరావు, సౌత్ ఏసీపీ కార్యాలయం హోంగార్డు బక్కా శ్రీనివాసరావు, వన్‌టౌన్ హోంగార్డు కొల్లూరి నాగేశ్వరి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో సునీత, ఏఆర్ ఏసీపీ ప్రసాదరావు, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సోమయ్య పాల్గొన్నారు.

రేపటి నుంచి జల, జన జాగరణ యాత్ర



మాట్లాడుతున్న అనుమోలు గాంధీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సాగు, తాగు నీటి సంరక్షణ, డెల్టా భూములు, నదీ జలాల పరిరక్షణ కోసం జూన్ 2వ తేదీన జల, జన జాగరణ యాత్ర చేపట్టనున్నట్లు భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధి అనుమోలు గాంధీ తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జల, జన జాగరణ యాత్ర 2వ తేదీ ఉదయం 8 గంటలకు యనమలకుదురు రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి ప్రారంభమవుతుందన్నారు. కృష్ణానది బండ్‌పై అవనిగడ్డ వరకు యాత్ర సాగుతుందన్నారు. నదీ గర్భంలో ఇసుక అక్రమ తవ్వకాలు నిలిపివేయాలని, బ్యారేజీకి దిగువన మరో రెండు బ్యారేజీలు నిర్మించాలని డిమాండ్ చేశారు. మడ అడవులను పునరుద్ధరించాలన్నారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ నిర్ణయంపై న్యాయ పోరాటం చేయాలని డిమాండ్ చేశారు. యాత్రలో రైతులు, పర్యావరణ పరిరక్షకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. నాయకులు ఏ క్రాంతి కుమార్‌రెడ్డి, మేడసాని విజయభాస్కర్, సగ్గుర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కునుకు 'పడితే.. ప్రాణాలు గల్లంతే'..!



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిద్రిస్తున్న వ్యక్తి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిద్ర సుఖం ఎరుగదు అనే మాటకు.. మద్యం మనిషిని రోడ్డున పడేస్తుందనే హెచ్చరికకు నిలువెత్తు నిదర్శనమే ఈ చిత్రం. పూటుగా మద్యం సేవించిన ఓ వ్యక్తి మురుగు కాలువ పక్కన.. నడిరోడ్డుపై నేల కూలిన బెంచీ రాళ్లనే పూలపాన్పుగా చేసుకొని హాయిగా నిద్రపోతున్నాడు. సింగ్‌నగర్‌లోని నార్త్‌జోన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం సాయంకాలం కనిపించిందీ దృశ్యం. స్థానికంగా నివసిస్తున్న ఓ వ్యక్తి మద్యం మత్తులో ఇంటికి వెళ్లకుండా ఇలా రాళ్లపై పడుకొని కనిపించాడు. అతడు ఏ మాత్రం ఆదమరచి నిద్రలో పక్కకు ఒరిగినా సైడ్ డ్రెయిన్‌లో పడిపోతాడు. ఇలా మద్యం మత్తులో సైడ్ డ్రెయిన్లలో పడిపోయి మందుబాబులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఈ ప్రాంతంలో అనేకం ఉన్నాయి. అటుగా వెళ్లే వారు ఆ వ్యక్తిని చూసి జాలిపడగా.. మరికొంతమంది మద్యం మహమ్మారి మనిషిని ఎలా రోడ్డున పడేసి.. ఇలా దిగజారుస్తుందంటూ మాట్లాడుకున్నారు. మితిమీరిన మద్యం.. మితిమీరిన వేగం.. ఏదైనా హానికరమే.. మందుబాబులూ మీ కోసం కాకపోయినా మీ కుటుంబ సభ్యుల కోసమైనా ఆలోచించండి.. మద్యానికి దూరంగా జీవించండి.. జరభద్రంగా ఉండండి.

చైనావాల్ నుంచి రథం సెంటర్ వరకు ప్రక్షాళన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి చైనావాల్ నుంచి బ్రాహ్మణ వీధి రథం సెంటర్ వరకు ఉన్న ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధమవుతోంది. శనివారం వెస్ట్ ఏసీపీ దుర్గారావు, వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్, దుర్గగుడి ఈఈ కోటేశ్వరరావు, వీఎంసీ అధికారులతో ఈవో శీనానాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మహామండపం నాల్గో అంతస్తులోని ఈవో చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆలయ పరిసరాల్లో ఆక్రమణలపై చర్చించారు. దుర్గగుడిపై త్వరలో ప్రారంభమయ్యే ఆషాఢ మాసోత్సవాలు, నెల రోజుల పాటు అమ్మవారికి భక్తులు సారె సమర్పించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి విచ్చేసే భక్తులు, తెలంగాణ బోనాలు, శ్రావణమాసంలో పెరిగే భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయంలో ఏర్పాట్లు చేయనున్నారు. వీకెండ్‌లో పెరుగుతున్న భక్తుల రద్దీ, పార్కింగ్ సమస్యతో పాటు దుర్గగుడి పరిసరాల్లో ఆక్రమణలపై సమీక్ష సమావేశంలో చర్చించారు.

శారద ప్రొఫెషనల్ అకాడమీ ఫర్ కాంపిటీటివ్ సెంటర్ ప్రారంభం



స్టడీ మెటీరియల్‌ను విడుదల చేస్తున్న కళాశాల యాజమాన్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్‌లోని శారదా డిగ్రీ కళాశాలలో ప్రొఫెషనల్ అకాడమీ ఫర్ కాంపిటీటివ్ సెంటర్ ప్రారంభమైంది. ఈ సెంటర్‌ను విశ్రాంత పోలీసు అధికారి ఎం.సత్యనారాయణరావు శనివారం ప్రారంభించి, విద్యార్థులకు అందజేసే స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదల, ఆత్మవిశ్వాసం, చక్కని ప్రణాళికతో కృషి చేయడం ద్వారా పోటీ పరీక్షల్లో సులభంగా విజయం సాధించవచ్చని పేర్కొన్నారు. శారద ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి కుందా రామనారాయణ మాట్లాడుతూ, డిగ్రీ కోర్సు పూర్తయ్యేలోగానే ప్రతి విద్యార్థికి ఉద్యోగ అవకాశం సాధించాలనే ఉద్దేశంతో శారద డిగ్రీ కళాశాల ప్రొఫెషనల్ అకాడమీ ఫర్ కాంపిటీటివ్ సెంటర్‌ను ప్రారంభించిందన్నారు. ఈ సెంటర్ ద్వారా పోటీ పరీక్షల శిక్షణ అందిస్తుందని తెలిపారు.

శిక్షణ కాలం నాలుగు నెలలు..

శిక్షణ తరగతులు శారద డిగ్రీ కళాశాల విద్యార్థులతో పాటు ఇతర డిగ్రీ కళాశాల విద్యార్థులు కూడా వారికి అనువైన విధంగా ఎంపిక చేసిన బ్యాచ్‌లలో శిక్షణ తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర డిగ్రీ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ప్రత్యేక బ్యాచ్‌లను ప్రారంభిస్తామన్నారు. శిక్షణ కాలం నాలుగు నెలలు ఉంటుందన్నారు. కళాశాల కరెస్పాండెంట్ బి.వరప్రసాద్, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.నాగేశ్వరశర్మ, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎల్.శ్రీధర్, కౌన్సిలర్ సత్యానందం పాల్గొన్నారు.

వెలమ నేస్తం పథకాన్ని అమలు చేయాలి



మాట్లాడుతున్న గోవిందరావు, పక్కన నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో వెలమ కులస్తుల సంక్షేమానికి వెలమ నేస్తం పథకాన్ని అమలు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 50 లక్షల జనాభా కలిగిన వెలమ సామాజిక వర్గానికి అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో న్యాయం చేయాలన్నారు. వెలమ సంక్షేమ సంఘానికి విశాఖ, తిరుపతి, సింహాచలంలో వెలమ భవనాలకు స్థలాలు కేటాయించాలని కోరారు. వెలమ నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా కూటమి ప్రభుత్వం కూడా ఉప ముఖ్యమంత్రి పదవి వెలమ సామాజిక వర్గానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. త్వరలో విశాఖపట్నంలో వెలమ గర్జన పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ సభ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు మాడిచర్ల వెంకటేశ్వరరావు, మాధవరావు, అప్పారావు, దాసరి నాగరాజు, గణేష్ నాయుడు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.